







భరించలేని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ టిక్ టిక్ మంటోంది గోడ నున్న గడియారం. శాపాన్ని అనుభవిస్తున్న దేవతలా గోడవారగా వున్న పేము కుర్చీలో కూర్చుని వుంది జానకమ్మ.

ఆమె చూపులు ఆ గడియారం ముళ్ళమీద వున్నాయి.

కాని ఆమె ఆలోచనలు మరికొన్ని గంటలో తాము కలుసుకోబోతున్న అమితానంద స్వామీజీమీద వున్నాయి.

ఆయనకు తనమీద దయ కలుగుతుందా? ఇప్పటికయినా తన ఇరవైయేళ్ళ కలలు పండుతాయా?

తలుచుకుంటే ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. తనదీ ఓ బ్రతుకేనా అనిపించింది. ఇంతకీ తనేం పాపం చేసిందనీ?

భగవాన్ ఎందుకు నాకీ శిక్ష? కనీసం ఇప్పటికయినా నన్ను కరుణించు....అప్రయత్నంగా చేతులు జోడించింది.

ఆమె ఎదురుగా దేవుడి ఫొటో లేదు. గోడ గడియారం వుంది. జానకమ్మకు ఆ తారతమ్యంలేదు. ఆమె ఇప్పటివరకూ ప్రతి వస్తువు లోనూ దేవుడిని చూస్తోంది....

టంగ్‌మని గంట కొట్టింది గడియారం....

'ఐదున్నర' అనుకుంది జానకమ్మ.

ఇంకా ఈయన రాలేదేం? ఎందువల్ల రాలేదు? ఐదు గంటలకే వస్తానని చెప్పారు ఉదయం ఆఫీసుకు వెళుతూ....

అందుకే తను నాలుగున్నర నించే ఆయన కోసం యెదురుచూస్తోంది.

త్వరగా వెళితేనే నయం....మరీ చీకటిపడి వెళితే అమితానంద స్వామీజీ దగ్గర ఎక్కువ మంది భక్తులు చేరవచ్చు....ఇప్పటికే ఆయన ఆ వూరు వచ్చినట్టు చాలామందికి తెలిసిపోయింది.

తనలాంటివాళ్ళు—నిర్భాగినులు—అదృష్టహీనులు ఇంకా ఎంతమంది వున్నారో? వాళ్ళందరూ ఆయన దగ్గరకు రారూ?

జానకమ్మకు అనుమానం వచ్చింది....

తన లాంటి అదృష్టహీన యెవరయినా వుంటుందా?

మాతృత్వానికి నోచుకోని నష్ట జాతకులు యెంతమంది వుంటారు? తనలాంటి ఎవరో? ఎంతో పాపం చేసుకున్నవాళ్ళు....

నిజమే—తను గతజన్మలో ఏదో ఘోరమయిన పాపమే చేసివుంటుంది. అందుకే భగవంతుడు తనకు ఈ జన్మలో బిడ్డను కనే యోగం లేకుండా చేశాడు....తనకు భరించలేని శిక్షను విధించాడు....

ఇంకా యెన్నాళ్ళీ శిక్ష? శోకం....బాధ....క్షోభ....రంపపు కోత....

ఇంతకుమించిన నరకం యే స్త్రీకయినా వుంటుందా?

మెదడు పగిలిపోయేలా ఆలోచిస్తోంది జానకమ్మ....ఎంత ఆలోచించినా ఆమెకు యెందుకిలా జరిగిందో తెలీటంలేదు.

తెలిసి తను ఏ పాపమూ చెయ్యలేదు. తెలియక చేసిన పాపం తననిలా వెంటాడుతుందా?


ఆమె హృదయంలో ఎన్నో అర్థం లేని ప్రశ్నలు....తను కనిన కలలు, పెంచుకున్న ఆశలు ఒక్కసారి త్రుళ్ళుకుంటే గుండె పగిలిపోతుందేమోనన్న భావన.

ఇరవైయేళ్ళ క్రితం వాస్తవానికి తను ఎన్ని కలలు కన్నది?

జానకిగా తనని అందరూ పిల్చేటప్పుడు తనకు పెళ్ళయ్యింది. అప్పుడు తనకు ఇరవైయేళ్ళు. తనకు ఆ సంబంధం కుదిరిందని తెలిసినప్పుడు భూమ్మీద నిలవాలనిపించలేదు. వయసు వచ్చిన దగ్గర్నుంచీ తను అందరు కన్నెపిల్లలాగే పెళ్ళి గురించి ఆ తర్వాత తను గడపబోయే వైవాహిక జీవితం గురించీ ఎన్నెన్నో కలలు కనటం మొదలుపెట్టింది....కాని తన దురదృష్టం ఇలా వుంటుందనేనేమో తన ఆలోచనలన్నీ పెళ్ళయిన తర్వాత తను పొందబోయే మాతృత్వం మీదనే వుండేవి. పెళ్ళయిన ఏడాదికే తనకు బంగారు పాప పుడతాడు. అందంగా, ఆరోగ్యంగా ఎంతో ముద్దొస్తూ....వాడిని తను అపురూపంగా పెంచుతుంది. వాడిని పెంచటంలోనే తను మునిగిపోతుంది. ఇంట్లో పసిబాబు తిరుగుతుంటే ఎంత సంతోషంగా, నిండుగా వుంటుంది? అసలు ఆడదానికి మాతృత్వమే హుందాతనాన్నిచ్చేది.

పెళ్ళయింది .... చూస్తుండగానే ఏడాది గడచిపోయింది....కాని తను ఆశించినట్లు ఏమీ జరగలేదు. అంతులేని నిరుత్సాహం....ఐనా ఆశ....కొంతమందికి అంతే....పెళ్ళయిన నాలుగేళ్ళ వరకూ పిల్లలు పుట్టరుట....నిజమే. ....తన తల్లికి కూడా అంతే....పెళ్ళయిన మూడేళ్ళకు అక్కయ్య పుట్టిందట....తనకు అమ్మ పోలిక వచ్చిందేమో....ఇలా అనుకుని మనసును సరిపెట్టుకోలేకపోయింది. అదే నిజమయితే తనకంటే ముందు పుట్టిన అక్కయ్యకు అమ్మ పోలిక యెందుకు రాలేదు? అక్కయ్యకు పెళ్ళయిన ఏడాదికే చక్కని బాబు పుట్టాడు. వాడిని చూసిన తర్వాతనే






తనలో మాతృత్వంమీది మమకారం మరింత పెరిగిపోయింది. పేరుకే అక్కయ్య కొడుకు. ....వాడి ఆలనా పాలనా అంతా తనే చూసేది. అప్పుడప్పుడు అక్కయ్య వాడికి పాలు ఇచ్చేది. అంతే....ఇంక మిగిలిన పనులన్నీ తనవే....స్నానం చేయించటం....పౌడరు అద్దటం....బొమ్మలతో ఆడించటం....యేడుస్తుంటే లాలించటం....ఒళ్ళో పడుకోబెట్టుకొని నిద్రపుచ్చటం....వాడి పనులన్నీ తనే చూస్తుంటే యెంతో తృప్తి....యెంతో ఆనందం....

"ఒసేవ్ జానీ....వాడు నా కొడుకా? నీ కొడుకా? నేను వాడిని మరచిపోయేట్టు వున్నాను" నవ్వుతూ అనేది అక్కయ్య....

"వీడు నా కొడుకే....నా బంగారు బాబే" తను వాడిని నవ్విస్తూ అనేది....

"పోన్లే....వీడిని నువ్వే వుంచేసుకో.... రేపు నీకు పుట్టే కొడుకును నాకు యిచ్చెయ్యవే."

"బాగానే వుంది మీ వరస....మీరు మాట్లాడుకుంటున్నది పసిపిల్లల గురించా? బొమ్మల గురించా?" అమ్మ మధ్యలో....

సినిమాలకు వెళ్ళినా, హరికథలకు వెళ్ళినా, పేరంటాలకు వెళ్ళినా తనే వాడిని ఎత్తుకునేది. వాడూ అంతే....అక్కయ్య యెత్తుకుంటే ఏడ్చేవాడు....తను చేతులు చాపితే నవ్వుతూ మీదకు దూకేవాడు.

అక్కయ్య తన యింటినించి వెళ్ళిపోయేటప్పుడు తనకు ఏడుపు ముంచుకొచ్చింది....తను బాబును చూడకుండా వుండగలదా? వాడు వుండగలడా?

తన అవస్థ గమనించి అక్కయ్య కొన్నాళ్ళు తన దగ్గర వుంచుకుంటానని తీసుకువెళ్ళింది. ....వెళ్ళిన పదిరోజులకే వాళ్ళు పెళ్ళికి ఒప్పుకున్నారనీ, వెంటనే రమ్మనీ నాన్ననించి ఉత్తరం....వచ్చేసింది....

ఆ తర్వాత ఇరవై రోజులకే పెళ్ళి....

చూస్తుండగానే మూడేళ్ళు దొర్లిపోయాయి. తన కలలు కలలుగానే మిగిలిపోయాయి.... తన కడుపు పండలేదు....తనలో ఏదయినా లోపం వుందేమో....అందుకే పుట్టింటికి వెళ్ళినప్పుడు ఓ లేడీ డాక్టరు వద్దకు తీసుకెళ్ళింది అమ్మ.

ఆమె పరీక్షచేసి 'నీకో యెలాంటి లోపం లేదు' అన్నది.

అంటే....ఉన్న లోపం ఆయనలోనేనా? కొన్నాళ్ళకు అదికూడా తీరిపోయింది.

ఆయన కూడా పరీక్ష చేయించుకున్నారు.

ఆ డాక్టరు ఆయనలో యెలాంటి లోపం లేదనీ పిల్లలు పుట్టే అవకాశం వుందనీ చెప్పాడు.... ఆ ధైర్యంతో యింకో రెండేళ్ళు గడిచాయి. ఎన్నేళ్ళు గడిచినా ఫలితం లేకపోయింది.... తను తల్లి కాలేకపోయింది.

ఏమిటిది? తనకు ఇక పిల్లలు పుట్టరా? తను యిలా జీవచ్ఛవంలా బ్రతకాల్సిందేనా?

ఎంతోమందికి తనమీద జాలి..... సాను భూతి....

ఎవరికి తోచిన సలహా వాళ్ళు యివ్వటం మొదలుపెట్టారు.... యెక్కడో సంతానం చెట్టు వుంది.... దాని చుట్టూ రోజూ వెయ్యిసార్లు నెల రోజులు ప్రదక్షిణం చేస్తే పిల్లలు తప్ప కుండా పుడతారుట....

తనూ ఆయనా ఆ చెట్టు దగ్గరకు వెళ్ళారు. తను ఎంతో భక్తితో రోజూ వెయ్యిసార్లు ప్రదక్షిణాలు చేసివచ్చింది. ఆ తర్వాత నాలుగు నెలలు గడిచాయి. తన పరిస్థితిలో యెలాంటి మార్పు లేదు.

నెలరోజులు కాగానే చాపా, చెంబూ తీసుకుని బయట కూర్చునేది....

ఆఫీసునించి వచ్చిన ఆయన ఆ దృశ్యం చూసి చిరుకారిపోయేవారు....

తను ఆయన చూస్తున్నారని తెలిసి మొహాన్ని ఏవైపుకో తిప్పుకునేది ఏదో గొప్ప నేరం చేసినట్టు.... ఆ పరిస్థితిలో తనమీద తనకే జాలి కలిగేది. ఐనా తను ఏం చెయ్య గలదు?

ఇలా గడిచింది ఇరవైయేళ్ళ కాలం.... ఎప్పటికప్పుడు యేదో ఆశ.... ఇంకేదో నమ్మకం.... ఎవరో చెప్పుకునే మాటలు వింటుంటే ఆశ చిగురించేది.... ఏ దేశంలోనో ఒకామెకు నలభయ్యో ఏట మొదటిసారిగా కవలలు పుట్టారుట....

ఇలాంటి మాటలే తనలో ఎప్పటికప్పుడు వెలుగును నింపేవి....

ఈ చీకటి బ్రతుకులో వెలుగురేఖ ఉదయించదా?

ఏ దేవుడో తన మొర ఆలకించకపోడు.... ఏ దేవతో తన క్షోభను గ్రహించక పోదు....

ఇవాళ.... రేపు....

ఇంకా ఎన్నాళ్ళు?.... ఇప్పుడు తన వయసు నలభై.... ఆయనకు నలభై ఆరు.

ఈ ఇరవై యేళ్ళలో తను ఎంతమంది దేవుళ్ళకు మొక్కిందో.... ఎన్ని దేవుళ్ళకు పూజలు చేసిందో....

ఆ పూజలన్నీ ఏమయినాయి? ఒక్క దేవుడికీ తనమీద దయ కలగలేదా?

దేవుడూ.... నన్ను కరుణించు.... నా కడుపున ఒక కాయ కాయించు.... స్త్రీగా పుట్టి నందుకు నా జన్మకు సార్ధకతను ప్రసాదించు....

ఈ ఒక్క కోరికే దేవుడూ.... ఓ చిన్న కాంతికిరణం చాలు....

ఇలా ఎన్నిసార్లో ఎన్నో రాత్రులు దిండులో తల దూర్చి గుండెలు నొప్పిపుట్టేలా కుమిలి కుమిలి ఏడ్చింది జానకమ్మ.

ఐనా ఆ దేవుడికి జానకమ్మమీద దయ కలగలేదు.... దేవుడు తన పట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించినా ఆమెకు దేవుడిమీద నమ్మకం సడలిపోలేదు.... ఇంకా యెక్కువయింది. ప్రతి వస్తువులోనూ దేవుడిని చూడగలుగుతోంది....

'నువ్వు నిప్పుల్లో దూకితే నీకు కొడుకు పుడతాడు' అని ఏ దేవుడయినా కల్లో కనిపించి చెబితే దూకటానికి సిద్ధంగా వున్నది జానకమ్మ....

కనీసం జానకమ్మకు దేవుడు అలాంటి సలహాలయినా ఇవ్వటంలేదు.... ఇస్తే ఆమె జీవితం అంతమై పోతుంది. అప్పుడు ఇలా బ్రతికుండి నరకం అనుభవించటం తప్పి పోతుంది....


జానకమ్మ చీకటి బ్రతుక్కి వెలుగును చూపేదెవరు?

"ఎవరో ఎందుకు? అమితానందస్వామీజీ నీ జీవితానికి వెలుగును ప్రసాదిస్తారు జానకమ్మా" అన్నది ఆ రోజు ఉదయం జానకమ్మతో పక్కింటి విధవామె.

అ క్రితంరోజు రాత్రే స్వామీజీ ఆ వూరు వచ్చాడు.... ఆయన ఇంతకుముందు ఎంతో








మందికి యాభయ్యోఏట కూడా సంతానభాగ్యం కలిగించాడని చెప్పింది పక్కింటామె.

జానకమ్మకు ఆ మాటలు వినగానే ఆశ మరిన్ని చిగురులు వేసింది.... వెంటనే ఈ విషయాన్ని భర్తతో చెప్పింది.... ఆ స్వామీజీని మరురోజు తమ యింటికి భిక్షకు రమ్మని ఆహ్వానించుదామన్నది. సరేనన్నాడు భర్త.... సాయంత్రం ఆఫీసునించి ఐదు గంటలకే వస్తాననీ, ఆమెను కూడా తీసుకుని స్వామీజీ దగ్గరకు వెడదామనీ అన్నాడాయన.... కాని ఇంత వరకు రాలేదు.

భర్త రాకకోసం యెదురుచూస్తోంది జానకమ్మ....

ఆరున్నర దాటుతుండగా వచ్చాడు భర్త రంగనాధం.

ఆఫీసులో పని ఎక్కువగా వుండటంవల్ల రాలేకపోయానని చెప్పి జానకమ్మను తీసుకుని హడావిడిగా రిక్షాలో స్వామీజీ బస దగ్గరకు బయల్దేరాడు రంగనాధం....

ఆయనకీ మనసులో ఆత్రుతగానే వుంది.... ఈ స్వామీజీ ఏం చెబుతాడో? ఈయన దయ వల్లనైనా జానకి కడుపున ఓ కాయ కాస్తే.... తమ జీవితాలకు దిగులు వుండదు.... పాపం.... జానకి యెంతటి ఘోరమయిన నరకాన్ని అనుభవిస్తోంది?

రిక్షా ఆగింది.... దిగారు.

అప్పటికే అక్కడ చాలామంది స్వామీజీ దర్శనార్ధం వచ్చి వున్నారు.... అంతమంది వున్నా రంగనాధం దంపతులకు స్వామీజీ దర్శనం త్వరగానే అయ్యింది. అక్కడ రంగనాధంకి బాగా తెలిసిన వ్యక్తులు వున్నారు.... వాళ్ళే స్వామీజీని ఆ వూరు రప్పించారు....

భక్తితో స్వామీజీకి సాష్టాంగ నమస్కారం చేశారు జానకమ్మ, రంగనాధం.... ఆయన చిరునవ్వుతో దీవించారు. మరురోజు భిక్షకి తమ యింటికి రావలసిందిగా కోరాడు రంగనాధం.... స్వామీజీ కుదరదని అన్నారు.... ఐనా రంగనాధం తన పలుకుబడిని ఉపయోగించి ఆ మరురోజు ఉదయం స్వామీజీ తమ యింటికి భిక్షకు వచ్చేట్టుగా ఆయన అంగీకారాన్ని పొంది జానకమ్మతో ఆయనకు మరో సారి నమస్కారం చేసి అక్కడివించి బయటకు వచ్చాడు....

"స్వామీజీ ఐనా మనల్ని అనుగ్రహిస్తారా?" దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో అడిగింది జానకమ్మ.... అనునయంగా భార్య

భుజంమీద చిన్నగా తట్టాడు రంగనాథం....

*　　*　　*

అద్దంలో తన నిండు రూపాన్ని చూసు కున్న ఉషకు తనలో తన శరీరంలో ఏదో మార్పు కలిగినట్లు లీలగా అనిపించింది. మరింత పరీక్షగా చూసుకుంది. పదిరోజులనించే తను అనుమానపడుతోంది.

ఇప్పటికి రెండునెలలు గడిచిపోయాయి.... ఇంట్లో చెప్పలేదు....

కొంపదీసి తన అనుమానం నిజమేనా?

మైగాడ్! తను చచ్చిపోతుంది....

గబగబా డ్రెస్ చేసుకుంది....హాండ్ బాగ్‌ని తీసుకుని చెప్పులు టకటక లాడించుకుంటూ తన గదిలోనించి బయటకు వచ్చి మెట్లు దిగి కిందికి వచ్చింది....

కింద డ్రాయింగ్ రూమ్‌లో ఉష తల్లి మహిళామండలి సభ్యులతో మాట్లాడుతోంది. ....కూతురి హడావిడి నడక చూసి "ఏమిటీ ఆ తొందర?" అన్నది నవ్వుతూ.

"ఏడుగంటలకు సరిత ఇంటికి వస్తానని ప్రామిస్ చేసాను మమ్మీ" అన్నది గారేజ్ వైపు చూస్తూ.

గారేజ్‌లో కారు లేదు....

"కారు యేమయ్యింది మమ్మీ?...." అడిగింది.

"వాడు మోహన్ తీసుకెళ్ళాడు" చెప్పింది తల్లి.

'వీడొకడు....కారును బతకనివ్వడు....' అనుకుంటూ విసుగ్గా బయటకు వచ్చింది....

రోడ్డుమీదకు రాగానే ఖాళీగా వున్న ఆటో వస్తూ కనిపించింది. దాన్ని ఆపి ఎక్కి కిరణ్ ఎడ్రస్ చెప్పింది ఉష.

ఆటో ముందుకు దూసుకుపోయింది.

ఉష ఆలోచనలు వెనక్కి పరుగు దీస్తున్నాయి.

రెండు నెలల క్రితం ఓ రాత్రి కిరణ్ గదిలో తను పొందిన అమర సుఖం గురించి ఆలోచిస్తోంది....

ఓహ్....ఎంత మధురమయిన అనుభవం? ....ఆ తర్వాత ఎన్నోసార్లు, ఆ గదిలో.... కిరణ్‌తో....

దాని ఫలితమేనా తనలో యీ మార్పు?

ఆటో ఆగింది....ఫేర్ చెల్లించి గేటు నెట్టుకొని గబ గబా మెట్లెక్కి పై నున్న గదిలోకి వెళ్ళింది.

ఉష వెళ్ళేసరికి కిరణ్ సిగరెట్ కాలుస్తూ టేప్ రికార్డర్‌లో ఓ హిందీపాట వింటున్నాడు.

"హల్లో డార్లింగ్ కమాన్" అన్నాడు ఉషను చూసి నవ్వుతూ.

వెళ్ళి అతని ఎదురుగా కూర్చుంది.

"ఏమిటీ అలా వున్నావ్? వాట్ హేపెండ్? ఎనీ థింగ్ రాంగ్??" ఆమె రెండు భుజాల మీదా చేతులు వేసి నొక్కుతూ అడిగాడు.

తన మనసులో వున్న అనుమానాన్ని బయట పెట్టింది ఉష.

"ఇంతేనా? యూ డోంట్ వర్రీ....నాకు తెలిసిన ఓ డాక్టర్ ఫ్రెండ్ వున్నాడు....వాడి దగరకు వెడదాం....జస్టు ఫైవ్ మినిట్స్" అని సిగరెట్టును బయటకు విసిరి టవల్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళాడు కిరణ్....

పాట వింటూ కూర్చుంది ఉష.

కొంచెంసేపట్లో ఇద్దరూ స్కూటరుమీద డాక్టర్ ప్రకాష్ దగ్గరకు వెళ్ళారు.

అతను ఉషను బాగా ఎగ్జామిన్ చేసి నెల తప్పిందని చెప్పాడు.

"మైగాడ్!...." అన్నది ఉష కంగారుగా.

"యూ సిల్లీ....ఇందులో ఏముంది? ఎందుకలా భయపడతావ్?" అన్నాడు కిరణ్.

"మా డాడీకి, మమ్మీకి తెలిస్తే షూట్ చేస్తారు...."


"తెలిస్తే గదా!"

"తెలీకుండా ఎలా?"

"యూ చైల్డిష్....ఇంత ఇన్నోసెంట్ వనుకోలేదు....ఎబార్షన్ సంగతి మరచిపోయావా...." అని "ఏరా ప్రకాష్....మరి ఎబార్షన్ ఎప్పుడు చేస్తావ్?...." అన్నాడు కిరణ్.








"ఎబార్షన్ అవసరం వుందంటావా?" అడిగాడు డాక్టర్.

"ఎందుకు లేదు. అబార్షన్ చెయ్యకుండా ఎలా?"

"ఏం లేదు....మీరిద్దరూ మ్యారేజ్ చేసుకోబోతున్నారు కదా!"

"ఎందుకు!" అడిగాడు కిరణ్.

"చేసుకునేట్టయితే ఇప్పుడే చేసుకోండి. ఎబార్షన్ అవసరం ఉండదు."

"నో....నే నందుకు ఒప్పుకోను" అన్నది ఉష.

"ఎందుకూ?" ప్రకాష్ అడిగాడు.

"ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. చేసుకున్నా యిప్పట్నించే పిల్లలు వద్దు.... ఖర్చీగా వుంటుంది....ఇప్పుడే పిల్లలు పుడితే వన్నియర్ అయ్యేసరికి అమ్మమ్మలాగా తయారవుతాను. ఐ డోంట్ లైకిట్....నాకు పిల్లలు వద్దు....ఎబార్షన్ చెయ్యండి డాక్టర్" అన్నది ఉష.

"యస్....నా ఐడియా కూడా అదే" అన్నాడు కిరణ్.

ఉష మాటలకు డాక్టర్ ప్రకాష్ షాక్ తిన్నాడు. ఉషకేసి ఆశ్చర్యంగా చూసి "స్త్రీకి మాతృత్వం ఎంతో విలువైనది. అందునా తను తొలిసారిగా తల్లి కాబోతుందని తెలిసినప్పుడు ఎంతో సంతోషపడుతుంది....ఈ దేశంలో ఎంతమంది స్త్రీలు సంతానంకోసం చెట్లకీ, పుట్టలకీ మొక్కుతున్నారో మీకు తెలుసా!" అన్నాడు డాక్టర్.

"అలాంటివాళ్ళను నా దగ్గరకు పంపించు ప్రకాష్....మేము నీ దగ్గరకు వచ్చింది యీ విషయాలు తెలుసుకోటానిక్కాదు....ముందు ఎబార్షన్ ఎప్పుడు చేస్తావో చెప్పు" అన్నాడు కిరణ్ అదోలా మొహం పెట్టి.

"ఆల్‌రైట్!....మీ ఇష్టం ఓ నాలుగు రోజుల్లో చేస్తాను" అన్నాడు.

"నాలుగురోజులా? కుదరదు....వెంటనే జరిగిపోవాలి... రేపే చేసెయ్య....ఇంకా లేట్ చెయ్యటానికి వీల్లేదు."

"సరే....అలాగే....రేపు మార్నింగ్ టెన్‌కి వస్తే సాయంత్రం యింటికి వెళ్ళిపోవచ్చు."

"థాంక్యూ!" అని లేచి నిలుచున్నాడు




సరసమైన ధరలలో నాణ్యత కలిగిన అన్నిరకముల
పట్టుచీరలకు ప్రసిద్ధి!



కిరణ్. తను కూడా ప్రకాష్‌కి థాంక్స్ చెప్పి కిరణ్‌తో బయటకు నడిచింది ఉష.

"బ్యూటీ క్వీన్‌గారి మనసు కుదటపడ్డ ట్టేనా?" స్కూటర్ స్టార్టు చేస్తూ అడిగాడు కిరణ్.

నవ్వింది ఉష.

రాత్రి తొమ్మిది గంటలవరకూ కిరణ్‌తో గడిపి ఇల్లు చేరుకుంది ఉష. ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్టలేదు. 'ముందు ఈ పీడను వదలించుకుంటేగానీ నిద్ర పట్టదు' అనుకుంది.

చివరికి ఎప్పటికో నిద్రపోయింది....

తెల్లవారింది....లేచేసరికే ఎనిమిది గంటలయింది. తొమ్మిదిన్నర అయ్యేసరికి డ్రెస్ చేసుకుని తన గదిలోంచి బయటకు వచ్చి మెట్లు దిగబోతుండగా ఎదురింట్లోకి వెళుతున్న అమితానందస్వామీజీ ఆయన శిష్యులు కనిపించారు.

అప్పుడే పైకి వచ్చిన పనిమనిషి వరదమ్మను "వాళ్ళంతా అ ఎదురింట్లోకి ఎందుకొచ్చారే" అనడిగింది.

"ఏవుందమ్మా.......మామూలే....ఆ జానకమ్మగారికి పిల్లలు లేరు గదా....అందుకని ఆమె సోములోరికి యివాళ పూజ చేసుద్దంట" చెప్పింది వరదమ్మ తనూ వాళ్ళని చూస్తూ.

ఆ మాటలు వింటూంటే ఉషకు అంతులేని నవ్వొచ్చింది.

'స్వాములవారికి పూజ చేస్తే పిల్లలు పుడతారా? బ్రైన్‌లెస్ ఫెలోస్' అనుకుంటూ గబగబా మెట్లు దిగింది.

* * *

సాయంత్రం ఐదుగంటలయింది.

మేడముందు ఆటోలోనించి దిగింది ఉష. ఫేర్ చెల్లించింది.

ఆటో వెళ్ళిపోయింది. గేటు నెట్టుకొని లోపలకు వెళ్ళబోతూ ఆగిపోయింది.

ఉషకు యెదురింటి బయట గుంపులు గుంపులుగా ఆడా మగా నిలబడి ఏవో మాటలు చెప్పుకుంటూ కనిపించారు.

ఒక్క నిమిషం అక్కడ నిలబడి విషయం తెలీక లోపలకు నడిచింది.

ఉషకు నీరసంగా వున్నా గుండెల్లో కత్తిలా వున్న ఆ పీడ వదలిపోయినందువల్ల సంతోషంగా, హుషారుగా వుంది.

మేడమీదికి వెళ్ళి ఎదురింట్లోకి చూసింది. త్రుళ్ళిపడింది.

జానకమ్మ శవాన్ని ముందు గది బయట పడుకోబెట్టారు....రంగనాథం సన్నగా ఏడుస్తున్నాడు....ఆయన్ని యెవరూ ఓదార్చలేకపోతున్నారు.

'ఆమె యింత హఠాత్తుగా యెలా చనిపోయింది? ఉదయం కూడా ఆమె బాగానే వుంది....ఇంతలోనే....'

ఉష ఆలోచిస్తూ నిలబడిపోయింది.

ఇంతలోనే ఉష గదిలోనించి చీపురుతో బయటకు వచ్చింది పనిమనిషి వరదమ్మ.

"ఆమె యింత సడన్‌గా యెలా చచ్చిపోయిందే వరదమ్మా" అడిగింది ఉష.

"ఏముందమ్మా... బలవంతంగా సచ్చిపోయింది...."

"ఎందుకు?"

"ఇంకెందుకు? ఆ పొద్దునొచ్చిన సోములోరు ఆ యమ్మ సెయ్యి జూసి ఈ జన్మకు పిల్లలు పుట్టరని సెప్పాడంట....అందుకని ఆయ నటు వెళ్ళగానే యిషం తిని సచ్చిపోయింది."

ఉషకు కడుపులో యెవరో చెయ్యిపెట్టి దేవినట్లనిపించింది.

గుండెల్లో కలుక్కుమంది.

పిల్లలు లేరని ఆమె విషం తిని చచ్చిపోయిందా? పిల్లలు లేకపోవటం ఇంత దారుణానికి దారి తీస్తుందా?

'స్త్రీకి మాతృత్వం యెంతో విలువైనది' డాక్టర్ ప్రకాష్ మాటలు ఉష చెవుల్లో గింగురుమంటున్నాయి....

'ఆడదానికి మాతృత్వం యింత విలువైనదా?' అవును. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం యెదురింట్లో భర్త ఒళ్ళో ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్న జానకమ్మ శవం. □